క్లుప్తంగా

ఆర్థికసాయం



చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన రజిత తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.30 వేలను సోమవారం రజితకు ఆర్థికసాయంగా అందజేశారు. రాజు, యాదగిరి, ఎడ్ల రాధికా రెడ్డి, భారతి, బుచ్చయ్య, నర్సయ్య, రాజ్‌కుమార్, యాకూబ్‌పాషా, కోటి, రమేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి నర్సయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పలువురు ఆర్థికసాయాన్ని అందించారు. మాజీ సర్పంచ్ చల్ల సుధాకర్‌రెడ్డి వెయ్యి రూపాయలు, చల్ల రాజేందర్‌రెడ్డి 50 కిలోల బియ్యాన్ని అందించారు. నాయకులు రాములు, నరేష్, జనార్దన్, సత్తయ్య, రాజిరెడ్డి, బాలరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

మీసేవ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం



జనగామ: మీసేవ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊరడి సతీష్, ఉపాధ్యక్షులుగా మల్లెల కుమార్, వంగ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి రాజు, సహాయ కార్యదర్శు లుగా ఆకునూరి బ్రహ్మచారి, కొలిపాక సతీష్, కోశాధికారులుగా ఎండీ.పాషా, గాజులపాటి సరోజన, సహాయ కోశాధికారిగా బుల్లె సురేష్, ప్రచార కార్యదర్శిగా ముసుకు సందీప్, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా రాయారపు రాజశేఖర్, సలహాదారులుగా నల్ల లక్ష్మీపతి, రాపోలు పృథ్వీ, మహిళా విభాగం వీఎల్ఈ సమన్వయకర్తలుగా రచ్చ భవాని, గోనెల పరమేశ్వరి, మీడియా ఇన్‌చార్జ్‌లుగా దేశగాని నాగరాజు, గైని అనిల్ కుమార్, స్పోక్స్ పర్సన్‌గా పడకంటి భాస్కరాచారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాన్నాల శోభన్ బాబు, రాజ్ కమల్, దుడక మధుకుమార్, వైట్ల యాకయ్య, షాగ వేణుగోపాల్, బోయిని మహేందర్‌ను ఎన్నుకున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైర శంకర్, ఎండీ మోయిద్ తెలిపారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేశ్



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివునిపల్లికి చెందిన మారెడుపాక రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ ఆచార్య నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ సోమవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పదవితో తనపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

యాసంగి సాగుకు సమాయత్తం

- చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరు
- పెరగనున్న వరిసాగు విస్తీర్ణం
- దుక్కులు, వరినాట్లలో రైతులు బిజీబిజీ



వరినాటు వేసేందుకు సిద్ధం చేసిన పాలం

జఫర్‌గఢ్ : యాసంగిలో వరి పంటసాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. వానాకాలం సీజన్‌లో బోర్లల్లో నీరు అడుగంటి పోయి కొంతమేర పంట చేతికిరాలేదు.. దీంతో ఆలస్యంగా వర్షాలు కురవడంతో బోరుబావిల్లో ఒక్కసారిగా నీటిమట్టం పెరిగి పంట దిగుబడితో రైతులకు ఊరటనిచ్చింది. కాగా ఆలస్యంగా కురిసిన వర్షాల వల్ల చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో యాసంగి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. మండలవ్యాప్తంగా కొన్నేళ్ల నుంచి అనుకున్న సమయంలో సరైన వర్షాలు లేక పంటల సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. ఈ వానాకాలంలో కూడా ప్రారంభంలో వర్షాలు కురవలేదు. దీంతో రైతులు కేవలం వ్యవసాయ బోరు బావుల కిందనే వరిపంటను సాగు చేశారు. మొత్తం 14,200 ఎకరాల్లో వరి పంట సాగైంది. సాగు మొదట్లోనే వర్షాలు లేక బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో కొంత పంట ఎండిపోయింది. ఆ తర్వాత వరుణుడు కరుణించిన పెట్టుబడుల భారం పెరిగింది. దీంతో ఉన్న పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోయినప్పటికీ కనీసం పెట్టుబడులైన రావడంతో రైతులకు ఉపశమనం లభించినట్లయింది. ప్రస్తుతం రైతులు యాసంగి సాగుపై కోటి ఆశలు పెట్టుకున్నారు. యాసంగిలోనైనా పంట దిగుబడి రాకపోదా చేసిన, అప్పులు తీర్చలేకపోతామా అనే ధీమాతో అన్నదాతలు ఉన్నారు. ఈసారి చెరువులు, కుంటలు నిండి ఉండడం, వ్యవసాయ బోరు బావుల్లో సైతం నీటిమట్టం పెరగడంతో యాసంగి సాగు విస్తీర్ణం పెరగనుంది. యాసంగి సాగుకు కావాల్సిన వివిధ రకాల విత్తనాలు ఇప్పటికే రైతులు కొనుగోలు చేయడంతో పాటు బోరు బావుల వద్ద వరి నార్లు పోసుకున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు బురద దున్ని (దమ్ము చేయడం) వరినాట్లు వేసేందుకు సమయాత్తమవుతున్నారు. మరికొందరు వరి నార్లు పోయడంతో పాటు దుక్కులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

మళ్లీ వరి సాగు చేస్తున్నా..



వానాకాలంలో వ్యవసాయ బోరుబావి కింద నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసిన. మొదట్లో వర్షాలు లేకపోవడం వల్ల బోరు బావుల్లో ఒక్కసారిగా నీటి మట్టం తగ్గి ఇబ్బందులు పడ్డా.. ఆ తర్వాత ఆలస్యంగా వర్షాలు కురవడంతో కొంత మేలు జరిగింది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు ఉండడంతో బోరు బావుల్లో నీటి మట్టం పెరిగింది.దీంతో అంతే మళ్లీ వరి పంటను సాగు చేసేందుకు దుక్కులు సిద్ధం చేస్తున్నా. - ఎండీ మహబూబ్‌అలీ, రైతు, జఫర్‌గఢ్

వరి సాగు విస్తీర్ణం పెరగవచ్చు

యాసంగిలో కనీసం 90 రోజుల నుంచి 120 రోజుల్లో పంట దిగుబడి వచ్చే వరి పంటను మాత్రమే సాగు చేయాలి. ఈసారి ఆలస్యంగా కురిసిన వర్షాల వల్ల చెరువులు, కుంటలు నిండడంతో పాటు బోరు బావుల్లో నీటిమట్టం పెరిగింది. దీంతో వానాకాలం కంటే యాసంగిలో వరి సాగు విస్తీర్ణం కొంత పెరిగే అవకాశం ఉంది. యాసంగిలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేస్తే రైతులకు ఎంతో మేలు ఉంటుంది. - కరుణాకర్‌రెడ్డి, ఏఓ

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్ : విద్యుత్ కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పచ్చదనంతో కూడిన మొక్కలను పెంచాలని ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని డీఈ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని, వినియోగదారులు తమ గృహ, వాణిజ్య, బోరుబావులకు సంబంధించిన విద్యుత్‌బిల్లులు ఎలాంటి బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఈ లక్ష్మీనారాయణ, ఏఈ శంకర్, సబ్ ఇంజనీర్ హరిత, వై.రాజేందర్, వాసం శ్రీధర్‌పటేల్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అందించాలి

పాలకుర్తి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అందించాలని మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన రైతు కొమురోజు సోమన్న అధికారులను కోరారు.

‘అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి’



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న కనకారెడ్డి

లింగాలఘణపురం : అర్హులైన పేదలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కళ్లెంలో సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కరుణాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పెన్షన్లు, ధరణిలో పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు, శేఖర్, రమేశ్, శంకరయ్య, దేవదానం, ఉప్పలయ్య, సమ్మయ్య, సుల్తానా, శ్రీనివాసు, కిష్టయ్య, యాదగిరి పాల్గొన్నారు. అంతకు ముందు కనకారెడ్డి సీపీఎం జెండాను ఆవిష్కరించారు.

సీపీఎంను ఆదరించాలి : మునిగెల రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్ : నిత్యం ప్రజాపోరాటాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల కోసం పనిచేసే సీపీఎంని ప్రజలు ఆదరించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. సోమవారం ఘన్‌పూర్‌లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఘన్‌పూర్‌లో ఈనెల 27, 28 తేదీలలో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో 18, 19, 20వ తేదీలలో ఘన్‌పూర్ పట్టణంలో సీపీఎం ఇంటింటి క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోదావరి జలాలు అందించడమే ధ్యేయం

- జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి : యాసంగి సాగులో ప్రతి ఎకరాకు గోదావరి జలాలు అందించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చర్యలు చేపట్టారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ ద్వారా లింగాలఘణపురం మండలంలోని పలు గ్రామాల చెరువులు నింపేందుకు సోమవారం మండలంలోని జాఫర్‌గూడెం నుంచి ఖిలాషాపూర్, మాధారం, ఇబ్రహీంపూర్ గ్రామాల ద్వారా వెళ్లే కెనాల్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో అశ్వరావుపల్లి కుడి కాల్వ చుట్టు ఉన్న రైతుల ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి కృషి చేస్తున్న కడియం శ్రీహరి రైతుబాంధవుడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా యూత్ అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్, మేకల నరేందర్, లోనె శ్రవణ్‌కుమార్, ఎండీ బాషుమియా, గాదె మహేందర్‌రెడ్డి, కావటి భాస్కర్, కొంరెల్లి, కడారి రవి, తోటకూరి రమేష్, బంద కుమార్, శివప్రసాద్, రంగు రాజు, దేవేందర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ..

- మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత



బ్యాగులోని నగదు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

జనగామ రూరల్ : ప్రజలకు నిత్యం సేవలు అందించడంలో తమకు సాటిలేరని నిరూపించింది జనగామకు చెందిన ఆర్టీసీ కండక్టర్ రజిత. బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన బ్యాగుతో పాటు అందులోని నగదును అందజేసి నిజాయితీ చాటుకుంది. బీబీనగర్‌కి చెందిన ప్రయాణికుడు భూక్య రాజేష్ సోమవారం జనగామ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న బస్‌లో తన బ్యాగును మర్చిపోయి ఉప్పల్‌లో దిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అతను తన టికెట్ పై ఉన్న కండక్టర్ స్టాఫ్ నంబర్‌తో ఆమె ఫోన్ నంబర్ తెలుసుకొని ఆమెను సంప్రదించాడు. కాగా కండక్టర్ బస్‌లో పరిశీలించి బ్యాగు బస్సులో ఉందని సదరు ప్రయాణికుడికి తెలియజేయగా అతను జేబీఎస్‌కి వెళ్లి కండక్టర్ వద్ద నుంచి బ్యాగును తీసుకున్నాడు. అయితే ఆ బ్యాగులో రూ.1,50,000లు ఉన్నాయి. జేబీఎస్ బస్‌స్టేషన్ మేనేజర్ పోలీసుల సమక్షంలో ప్రయాణికుడికి బ్యాగును అందజేసి నిజాయితీ చాటుకున్నారు. ప్రయాణికుడు ఆర్టీసీ సిబ్బంది నిజాయితీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనగామ ఆర్టీసీ డీఎం స్వాతితో పాటు సిబ్బంది కండక్టర్ రజితను అభినందించారు.

కృత్యాధార బోధనతో సరైన అవగాహన



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ, క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్ : కృత్యాల ఆధారంగా పాఠాలు బోధిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందని ఎంఈఓ కొమురయ్య తెలిపారు. మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులు కృష్ణవేణి, రమేష్, రజని ఆధ్వర్యంలో సోమవారం సోషల్ స్టడీస్ కృత్యమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. కృత్యమేళా కార్యక్రమం బాగుందని, విద్యార్థులకు సబ్జెక్టు నేరుగా బోధించడం కన్నా కృత్యాల ఆధారంగా బోధిస్తే సులభంగా అవగాహన చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్‌ల పంపిణీ

శివునిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా నాయకుడు హరికిషన్ రెడ్డి,, క్లబ్ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



పూజలు నిర్వహిస్తున్న, అర్చకులు, భక్తులు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పరమ శివుడికి అతి ప్రీతికరమైన ఆరుద్రోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈఓ మోహన్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు డీవీఆర్.శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం..

చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ప్రారంభం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఈఓ లక్ష్మిప్రసన్న, ఛైర్మన్ శ్రీధర్‌రావు పర్యవేక్షించారు.



చిల్పూరు: తిరుప్పావై సేవలో గోదాదేవి

ఉమామహేశ్వర ఆలయంలో..

జనగామ రూరల్ : ధనుర్మాసం సందర్భంగా సోమవారం గుండ్లగడ్డ కాలనీలోని ఉమామహేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేక పూజలు చేశారు. అర్చకులు గంగు సాంబమూర్తి, రోజా, స్వాతిరెడ్డి, నాగవేణిరెడ్డి, స్రవంతి, ఈశాన్విత, ప్రభాకర్‌రావు, చుంచు శ్రీకాంత్, వినయ్, రాజు ఉన్నారు.

వానరాన్ని కాపాడిన రైల్వే ట్రాక్‌మెన్లు



కోతికి చికిత్స చేస్తున్న వైద్యుడు

రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ రైల్వే గేట్ సమీపంలో విద్యుదాఘాతానికి గురైన వానరాన్ని రైల్వే ట్రాక్‌మెన్లు కాపాడి మానవత్వం చాటుకున్నారు. సోమవారం ట్రాక్‌పై పనులు చేస్తుండగా అక్కడి వానరాల గుంపు చేరుకుంది. అందులోని ఓ కోతి రైల్వే విద్యుత్ వైర్లపై వెళ్లగా షాక్ తగిలి కిందపడి గాయపడింది. ఆ శబ్దానికి కోతుల గుంపు పారిపోగా గాయపడిన కోతి అక్కడే ఉండిపోయింది. ట్రాక్‌మెన్లు మేకల లక్ష్మయ్య, జోగు భాస్కర్, యాకయ్య, యాదగిరి గమనించి వెంటనే గాయపడిన కోతిని జనగామ వెటర్నరీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గాయపడిన కోతికి వైద్యం అందించేలా చొరవ చూపిన ట్రాక్‌మెన్లను వెటర్నరీ డాక్టర్ శివ, లక్ష్మణ్ అభినందించారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల : పల్లెల ప్రగతి కోసం పాటుపడిన మాజీ ప్రజా ప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ సర్పంచ్‌లు అన్నారు. చలో అసెంబ్లీ పిలుపు మేరకు పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు సోమవారం తెల్లవారు జామున అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా అణిచివేసే చర్యలు సరికాదన్నారు స్టేషన్‌ఘన్‌పూర్ సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తాటికొండ సురేష్‌కుమార్, విశ్వనాథపురం మాజీ సర్పంచ్ అనుమాండ్ల మల్లేశం, దేవరుప్పుల మండలంలోఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు గోపాలుదాసు మల్లేష్,బానోత్ గేమా నాయక్, రాజన్న, వర్రె మధు, బండి నర్సింహులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్ : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సీహెచ్.వెంకటస్వామి తన తల్లిదండ్రులు రామయ్య,వెంకటమ్మ జ్ఞాపకార్థం క్రిస్మస్‌ను పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలో పనిచేసే 20 మందికి, ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే 10మందికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, థామస్ కిరణ్ చేతుల మీదుగా అందించారు.

ఒగ్గు కళాకారుడి మృతి



ఐలయ్య (ఫైల్)

బచ్చన్నపేట : మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు చెట్టె ఐలయ్య (75) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. ఐలయ్యకు భార్య ఎల్లమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. పలువురు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

దేవరుప్పుల : గ్రామ పంచాయతీల్లో చాలీచాలని వేతనాలతో పనులు చేస్తున్న సిబ్బంది తమ హక్కుల కోసం నేడు (మంగళవారం) తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఊరూరా సిబ్బంది తరలిరావాలని సీఐటీయూ(జీపీ) జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న సోమవారం పిలుపునిచ్చారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు వినతి

జనగామ : లగచర్ల రైతులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించడంతో పాటు థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించడం అమానుషమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(మంగళవారం) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పించాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని రైల్వే క్వార్టర్స్ కాలనీలో సోమవారం కొయ్యడ నాగరాజు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులతో సోమవారం మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మారుజోడు రాంబాబు, కుమార్‌గౌడ్, కొయ్యడ మల్లేష్, కోళ్ల రవిగౌడ్, కూరెళ్ల వేదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

రఘునాథపల్లి : గొర్రెల, మేకల పెంపకందారులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జీఎంపీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గుండ వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని జీవాల వద్ద జీఎంపీఎస్ నాయకులతో కలిసి ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు గద్ద రాజు, బాలబోయిన శ్రీనివాస్, నాగయ్య, శ్రీశైలం, శ్రీనివాస్, యాదగిరి, వీరస్వామి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నర్మెట : శివాలయ పునర్‌నిర్మాణంలో భాగంగా మండలకేంద్రానికి చెందిన రైతు పాతూరి విజయ-బుచ్చిరెడ్డి దంపతులు సోమవారం రూ.5,116లు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.25లక్షలు వెచ్చించడం జరిగిందని, శివరాత్రి పర్వదినానికి విగ్రహ ప్రతిష్ఠలు పూర్తిచేయాలని సంకల్పించామని దాతలు సహకరించి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కొండ బాలయ్య, ముక్కెర రాజేష్, సంగి మల్లేషం, చెవుల రాజు, ఎర్రబోయిన మహేందర్, ప్రజ్ఞాపురం శ్రీధర్ పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో పూజలు

పాలకుర్తి టౌన్ : గురేరా ఫిలిమ్స్ నిర్మాణసారథ్యంలో చిత్రీకరిస్తున్న ప్రొడక్షన్ నంబర్-1 సినిమా యూనిట్ సోమవారం పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. సినిమా దర్శకుడు ఎస్ఎస్ వర్మ, హీరో డాక్టర్ విశ్వాస్, ప్రముఖ నటులు వెంకి మంకీ, పంచ్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్ సాయి, యూట్యూబర్ లక్కాకుల గౌతం స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

‘పరీక్ష నిర్వాహకుల తప్పిదం లేదు’

జనగామ : జిల్లా కేంద్రంలో ఈ నెల15వ తేదీన గ్రూప్-2 పరీక్ష నిర్వహణ సమయంలో అభ్యర్థి భూక్య సునీత విషయంలో నిర్వాహకుల తప్పిదం లేదని పరీక్షల రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాన్‌మారియా సెంటర్‌కు బదులుగా పక్కనే ఉన్న మరో సెంటర్ సెయింట్ మెరీస్‌కు వెళ్లారన్నారు. పరీక్ష రాసే సమయంలో ఇన్విజిలెటర్ సునీత హాల్‌టికెట్ చూసి, పరీక్ష కేంద్రం మారిందని చెప్పడంతో ఆమె, తనకు కేటాయించిన సెంటర్‌కు వెళ్లే క్రమంలో గేటువద్ద పోలీసులు అడుగగా, భర్త చెప్పడంతోనే అందులోకి వెళ్లినట్టు ఆమెనే ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఇందులో తమ తప్పేమీ లేదన్నారు.

ఎస్సై కర్తవ్య నిర్వహణ..

జనగామ : ఏబీవీ జూనియర్ కళాశాల సెంటర్ వద్ద గ్రూప్-2 పరీక్ష విధుల్లో భాగంగా పాలకుర్తి ఎస్సై మేకల లింగారెడ్డి విధి నిర్వహణలో కర్తవ్యాన్ని పాటించారు. పరీక్ష సరళి, బందోబస్తును పర్యవేక్షించేందుకు సెంటర్‌కు వచ్చిన డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను ఎస్సై గేటు వద్దనే నిలిపి, మొబైల్‌తో లోనికి అనుమతి లేదని తనిఖీ చేశారు. ఉన్నతాధికారి అని చూసి చూడనట్టుగా వదిలేయకుండా,డీసీపీ వద్ద ఉన్న మొబైల్స్ తీసుకుని అనుమతించారు. విధి నిర్వహణలో తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించిన ఎస్సైని డీసీపీ అభినందించారు.

టీసీఐవీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీలత



దేవరుప్పుల : తెలంగాణ చేనేత ఐక్య వేదిక మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కడవెండికి చెందిన దుడికి శ్రీలతను నియమించినట్లు టీసీఐవీ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, నాయకులు సామల పరమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

‘ఇందిరమ్మ’ సర్వే పారదర్శకంగా చేపట్టాలి



లింగాలఘణపురం: సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్/ లింగాలఘణపురం/ తరిగొప్పుల : అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి 22వ వార్డులో, లింగాలఘణపురం మండల పరిధిలోని చిక్కులోనిగూడెంలో సర్వే ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు నివాసం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని, దరఖాస్తుదారులు సంబంధిత పత్రాలను అందుబాటులో పెట్టుకొని సర్వే వేగవంతానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.అలాగే పట్టణంలోని 16వ వార్డులో చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మున్సిపల్ అధికారి కె.రవి, వార్డు కౌన్సిలర్ గాడెపాక రాంచందర్ సోమవారం పరిశీలించారు. ఇళ్ల వద్దకు అధికారులు వచ్చినప్పుడు ఆధార్, సెల్ నంబర్ నమోదు చేయగానే ఆటోమేటిక్‌గా సంబంధిత వివరాలు వస్తాయని ప్రజలందరూ దీన్ని గమనించాలన్నారు. కమిటీ మెంబర్లు ఎండీ ఇస్మాయిల్, ఎదునూరి యాదగిరి, గోవిందు ప్రేమలత, నాగయ్య, సతయ్య, దిలీప్, గాదెపాక వినయ్, ఎండీ గౌస్, నిర్మాల శంకర్ పాల్గొన్నారు. తరిగొప్పుల కార్యక్రమంలో ఎంపీఓ మాలతి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, శ్వేత పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ శివారు కురుమగూడెంలో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కురుమగూడెం వద్ద టాటాఏస్ వాహనంలో బియ్యం తరలిస్తుండగా గుర్తించారు. వాహనాన్ని నిలిపి పోలీసులు తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న కూలి గుగులోత్ వీరన్న పారిపోయాడు. వాహనంలో ఉన్న 70 బస్తాలకు చెందిన 40 క్వింటాళ్ల రూ.లక్ష విలువ గల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మర్రికుంట తండాకు చెందిన ధరావత్ హరికిరణ్, భూక్య అంజనేయులు, గుగులోత్ వీరన్నలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా..ఒకరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్‌లోని మోడల్‌కాలనీ సమీపాన జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడగా డ్రైవర్ సాయికుమార్‌కు స్వల్పగాయాలైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ ఓ సిటీకి చెందిన శ్రీలత, రాజిరెడ్డి దంపతుల కుమార్తె అమెరికాలో ఉంటుంది. అమెరికాలో ఉన్న కుమార్తెకు కొడుకు జన్మించగా సెప్టెంబర్ నెలలో కుమార్తె వద్దకు శ్రీలత వెళ్లింది. అమెరికా నుంచి ఆమె తిరిగి సోమవారం రాగా భర్త రాజిరెడ్డి, కుమారుడు సాయికుమార్ హైదరాబాద్‌లో శ్రీలతను రిసీవ్ చేసుకుని వారి కారులో సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో కారు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకోగా జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి అదుపుతప్పి బోల్తా పడింది. కాగా గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే బోల్తాపడిన కారు నుంచి బయటికి తీశారు. ప్రమాదంలో సాయికుమార్ చేతికి స్వల్ప గాయం కాగా ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు.

క్రైం కార్నర్

తమ్ముడిపై అన్న దాడి.. కేసు నమోదు

చిల్పూరు : తమ్ముడిపై అన్న దాడి చేయగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కర్రె రాజు, వెంకన్న అన్నదమ్ములు. వీరి మధ్య చాలా ఏళ్లుగా 20గుంటల వ్యవసాయ భూమి పంచాయితీ నడుస్తోంది.ఈక్రమంలో రోజు మాదిరిగానే రాజు ఆదివారం రాత్రి వ్యవసాయ భూమి వద్ద మొక్కజొన్న చేనుకు నీరు పారిస్తున్నాడు. ఆ సమయంలో వెంకన్న తన కుమారుడు రాజుతో పాటు మరో 8 మంది వెనుక నుంచి వచ్చి పట్టుకుని కాళ్లు చేతులను బంధించారు. కర్రలతో తీవ్రంగా కొట్టడంతో మృతి చెందాడనుకుని వెళ్లిపోయారు. తెల్లవారు జామున చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు, 108కి సమాచారం అందించారు. అప్పటికే వారు కొట్టిన దెబ్బలతో కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి, బాధితుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసుకుని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ : 9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)